7

సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం । 3 । జనవరి । 2023



రామయ్య దర్శనం.. ముక్కోటి దేవతల పుణ్యఫలం

ఉత్తర ద్వారంలో స్వామివారి దర్శనం నయనానందకరంగా సాగింది. వైకుంఠంలో ఈ ఏకాదశి రోజున స్వామివారిని ముక్కోటి దేవతలు దర్శించుకుంటారని, అందుకు వైకుంఠ ఏకాదశి రోజున స్వామి వారిని దర్శించుకుంటే ముక్కోటి దేవతలను దర్శించుకున్నంత పుణ్యఫలం సిద్ధిస్తుందని వేద పండితులు చెబుతున్నారు. వైకుంఠ ఏకాదశి రోజున వైకుంఠం నుంచి సరాసరి భద్రగిరిపై ప్రత్యక్షమైన స్వామివారిని దర్శించుకుంటే సర్వపాపాలు తొలగిపోయి వైకుంఠ ప్రాప్తి కలుగుతుందని భక్తుల ప్రగాఢ నమ్మకం.



మరికొన్ని ఫొటోలు 8లో







భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా తెరుచుకుంటున్న ఉత్తర ద్వారం



ఉత్తర ద్వారంలో దర్శనమిస్తున్న సీతారామ లక్ష్మణులు

భూలోక వైకుంఠమే..



శ్రీ సీతారామచంద్రస్వామి వారికి మహా హారతి ఇస్తున్న అర్చకులు

భద్రాద్రిలో వైభవోపేతంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు

- నేత్ర పర్వంగా సాగిన ఉత్తరద్వార దర్శనం
- శ్రీరామనామస్మరణతో మార్మోగిన భద్రగిరి
- కనుల పండువగా తిరువీధి సేవ
- తిలకించి.. పులకించిన భక్తజనం

భద్రాచలం: వేదపండితుల మంత్రోచ్ఛరణలు, ధూపదీపాల నడుమ జయ గంటలు మార్మోగుతుండగా భద్రాద్రి రామయ్య ఉత్తర ద్వారం గుండా భక్తులకు దర్శనమిచ్చారు. ఆ సమయాన భద్రగిరి సాక్షాత్తూ భూలోక వైకుంఠమే అయింది. ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా రామచంద్రస్వామి గరుడ వాహనంపై, సీతమ్మవారు గజవాహనంపై, లక్ష్మణస్వామి హనుమత్ వాహనంపై ద్వారం వద్దకు వేంచేశారు. ఒకవైపు దివ్యతేజంతో వెలుగొందుతున్న రామయ్య స్వామి, మరోవైపు విద్యుత్ దీపాలతో వెలుగొందుతున్న రామాలయ ప్రాంగణాన్ని చూసిన భక్తులు పరవశించిపోయారు. ఉత్తర ద్వారంలో స్వామివారిని కనులారా చూసి జయ జయ ధ్వానాలు చేశారు.

తెల్లవారుజామున 5 గంటలకు..

ఉత్తర ద్వార దర్శనానికి ముందు శ్రీ సీతారాముల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంప్రదాయం ప్రకారం సుప్రభాత సేవ, విశేష అభిషేకాలు గావించారు. అనంతరం మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛరణల మధ్య స్వామివారిని ఆలయ మర్యాదలతో వెండి గరుడ వాహనంపై ఉత్తర ద్వారంలోకి తీసుకొచ్చారు. తొలుత ఆలయ ఆస్థాన విద్వాంసులు శ్రీరామ కీర్తనలను ఆలపించారు. అనంతరం స్థానాచార్యులు కేఈ స్థలశాయి వైకుంఠ ఏకాదశి ప్రాశస్త్యాన్ని భక్తులకు వివరించారు. రామయ్య, సీత, లక్ష్మణ వాహనాల ప్రత్యేకతను తెలియజేశారు. సరిగ్గా 5 గంటలకు వివిధ మంగళ వాయిద్య గంట మోగుతుండగా వేదఘోషల నడుమ వైకుంఠ ద్వారం తలుపులు తెరుచుకున్నాయి.

వైభవంగా తిరువీధి సేవ..

ఉత్తర ద్వారంలో దర్శనమిచ్చిన అనంతరం శ్రీసీతా లక్ష్మణ సమేతుడైన స్వామివారు తిరువీధి సేవకు బయలుదేరి వెళ్లారు. గరుడ వాహనంపై స్వామివారు, గజ వాహనంపై సీతమ్మవారు, హనుమత్ వాహనంపై లక్ష్మణస్వామి రాజవీధి మీదుగా తాతగుడి వరకు తిరువీధి సేవకు వెళ్లగా వారికి ముందు చలువ చప్రంలపై ఆండాళ్, ఆళ్వార్ దేవతలు ఊరేగారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ స్వామివారి తిరువీధి సేవ వైభవంగా జరిగింది. వందలాది మంది భక్తులు స్వామివారి వెంట నడవగా గోవిందరాజ స్వామివారి ఆలయం వరకు వెళ్లిన స్వామి వారు ప్రత్యేక పూజలు అందుకున్న అనంతరం తిరిగి రాజ వీధి మీదుగా గ్రామోత్సవం ద్వారా ఆలయానికి చేరుకున్నారు.

మార్మోగిన రామనామం..

ముక్కోటి సందర్భంగా మిథిలాస్టేడియం ప్రాంగణ పరిసరాలు 'జై శ్రీరామ్.. జైజై శ్రీరామ్' నామస్మరణలతో మార్మోగాయి. నేత్రపర్వంగా సాగిన ఈ వేడుకకు రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. పావన గోదావరి నదిలో ఆదివారం రాత్రి జరిగిన స్వామి వారి తెప్పోత్సవం వేడుకలను చూసిన భక్తులంతా రాత్రి భద్రాచలంలోనే బస చేసి సోమవారం తెల్లవారుజామున ఉత్తర ద్వార దర్శనం ద్వారా వైకుంఠ రాముడిని తిలకించారు. ఆ కమనీయ ఘట్టాన్ని కనులారా చూసేందుకు చలిని కూడా లెక్క చేయకుండా తెల్లవారుజామున 2 గంటలకే ఉత్తర ద్వారం వద్దకు చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం, ఇల్లెందు, వైరా ఎమ్మెల్యేలు పొదెం వీరయ్య, హరిప్రియానాయక్, రాములునాయక్, ఎమ్మెల్సీ తాతా మధు, జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, కలెక్టర్ అనుదీప్ దంపతులు, సంగారెడ్డి కలెక్టర్ శరత్, ములుగు కలెక్టర్ కృష్ణ ఆదిత్య, మాజీ మంత్రి బలరామ్ నాయక్, ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రు, ఆలయ ఈఓ శివాజీ, ఆర్డీఓ రత్నకళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

పరవశించిన భక్తులు..

వైకుంఠాన్ని మైమరిపించేలా ప్రత్యేకంగా అలంకరించిన ఉత్తర ద్వారంలో ధూప, దీపాల నడుమ శ్రీ సీతా లక్ష్మణ సమేతంగా దర్శనమిచ్చిన రామచంద్రస్వామిని తిలకించిన భక్తులు పరవశించిపోయారు. ఉత్తర ద్వారంలో గంటసేపు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీరామ సహస్రనామార్చన నిర్వహించారు. వివిధ రకాల ఫలాలు నైవేద్యం, మంత్రపుష్పం సమర్పించారు. ఆ తర్వాత వేదపారాయణం నిర్వహించారు. రుగ్వేద, యజుర్వేద, సామ, అథర్వన వేదాలను పండింతులు పఠించారు. అనంతరం 108 ఒత్తులతో కూడిన హారతిని స్వామివారికి ఇచ్చారు. శరణాగతి, దండకం అనంతరం ద్వార దర్శన ప్రాశస్త్యాన్ని అర్చకులు వివరించారు.



ఉత్తర ద్వార దర్శనానికి భారీగా హాజరైన భక్తులు

వేడుకలు విజయవంతం

- కలెక్టర్ అనుదీప్ వెల్లడి

కొత్తగూడెంఅర్బన్: ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు విజయవంతమయ్యాయని కలెక్టర్ అనుదీప్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకలను వీక్షించేందుకు వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున భక్తులు భద్రాచలం వచ్చారని, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించారని అభినందించారు. పారిశుద్ధ్య కార్మికులు ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగిస్తూ పట్టణాన్ని పరిశుభ్రం చేశారని కొనియాడారు. ఈ నెల 1న జరిగిన స్వామివారి తెప్పోత్సవం సందర్భంగా మిరుమిట్లు గొలిపే బాణసంచాలతో పాటు గోదావరి తీరం భక్తుల రామనామస్మరణలతో మార్మోగిందని తెలిపారు. తెప్పోత్సవం, ఉత్తర ద్వార దర్శనానికి వచ్చిన భక్తులు.. అధికార యంత్రాంగం చేసిన ఏర్పాట్ల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారని పేర్కొన్నారు.

అడ్డొచ్చిన కరెంట్ తీగ..

శ్రీ సీతారామ చంద్రస్వామి వారి ఉత్తర ద్వార దర్శనం సందర్భంగా తలుపులు తెరిచే సమయంలో చిన్న అడ్డంకి ఎదురైంది. ఎడమ వైపున తలుపులు తెరిచే సమయాన పైనున్న విద్యుత్ తీగ అడ్డం వచ్చింది. గుర్తించిన ఆలయ సిబ్బంది వైర్‌ను తొలగించి తలుపు తెరిచారు. సిబ్బంది అప్రమత్తం కాకుంటే విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడేది. గతంలోనూ ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్నా.. ముందస్తు పర్యవేక్షణ లేకనే ఈ పరిస్థితి ఏర్పడింది.

న్యూస్‌రీల్

శ్రద్ధగా విధులు నిర్వర్తించండి

- ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రు



పీఓకు మెమెంటో అందజేస్తున్న ఉద్యోగులు

భద్రాచలంటౌన్: ఏజెన్సీలో ప్రభుత్వ ఉద్యోగం ఎంతో బాధ్యతతో కూడుకున్నదని ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రు అన్నారు. డివిజన్‌లోని ఐటీడీఏ, రెవెన్యూ ఉద్యోగులు సోమవారం పీఓను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి మెమెంటో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీ గిరిజనుల సంక్షేమం కోసం, వారికి సేవలందించేందుకు పని చేస్తున్నామని, అయితే శ్రద్ధగా విధులు నిర్వహిస్తేనే గిరిజనులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడగలుగుతామని చెప్పారు. విస్తృతంగా సేవలందించి వారి మన్ననలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ భగవాన్ రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జిల్లాకు 35 మంది రెగ్యులర్ వైద్యాధికారులు

చుంచుపల్లి: వైద్య, ఆరోగ్యశాఖలో రెగ్యులర్ పోస్టుల్లో తాజాగా నియామకమైన వైద్యాధికారులు సోమవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో జాయినింగ్ రిపోర్ట్ అందించారు. ఇప్పటివరకు కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న వీరికి.. రెగ్యులర్ పోస్టుల్లో ప్రాధాన్యం కల్పించిన ప్రభుత్వం మెరిట్ ఆధారంగా ఎంపిక చేసింది. కాగా, జిల్లాకు కేటాయించిన 35 మంది వైద్యాధికారులు రెగ్యులర్ పోస్టుల్లో జాయిన్ అయినట్లు డీఎంహెచ్ జేవీఎల్ శిరీష ఒక ప్రకటనలో తెలిపారు.

రాపత్తు సేవలు ప్రారంభం..

- తొలిరోజు డీఎస్పీ బంగ్లాలో నిర్వహణ
- నేటి నుంచి నిత్యకల్యాణాలు పునః ప్రారంభం

భద్రాచలం: ముక్కోటి ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా నిర్వహించే రాపత్తు సేవలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు స్థానిక డీఎస్పీ బంగ్లాలో శ్రీసీతారామచంద్రస్వామి వారికి సోమవారం రాత్రి ఈ వేడుకను వైభవోపేతంగా జరిపారు. ముక్కోటి ఉత్సవాల సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో రామయ్యకు రాపత్తు సేవలు నిర్వహించడం ఆనవాయితీ. స్వామివారి ఉత్సవ మూర్తులను ప్రత్యేక పల్లకిలో తీసుకొచ్చి పూజలు జరిపి ప్రసాదాలను అందజేశారు. ఈ వేడుకల్లో ఏఎస్పీ రోహిత్‌రాజ్, సీఐ నాగరాజు రెడ్డి, స్వామి, ఎస్సైలు శ్రీకాంత్, ట్రాఫిక్ ఎస్సై ఎస్ఎన్‌రావు తదితరులు పాల్గొన్నారు. కాగా, ముక్కోటి వేడుకల సందర్భంగా డిసెంబర్ 23న రద్దు చేసిన స్వామివారి నిత్యకల్యాణ వేడుకలను తిరిగి మంగళవారం నుంచి ప్రారంభించనున్నారు.



రాపత్తు సేవలో పాల్గొన్న ఏఎస్పీ, ఇతర పోలీసు అధికారులు

న్యాయసేవాధికార సంస్థ ప్రారంభం

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం కోర్టులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థను జిల్లా ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖరప్రసాద్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని మారుమూల గ్రామాల్లోని వారు కూడా ఈ న్యాయసేవాధికార సంస్థ ద్వారా సత్వర, ఉచిత న్యాయం పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి శ్యాంశ్రీ, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి.భానుమతి, ఖమ్మం జిల్లా లీగల్ సర్వీసెస్ ఆథారిటీ కార్యదర్శి మహ్మద్ అబ్దుల్ జావిద్‌పాషా, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ఎ.నీరజ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బి.రామారావు, ఫస్ట్‌క్లాస్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కె.దీప, కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనుబ్రోలు రాంప్రసాదరావు పాల్గొన్నారు.



లీగల్ సర్వీసెస్ అథారిటీని ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి చంద్రశేఖరప్రసాద్

రేపు జిల్లాస్థాయి యువజనోత్సవాలు

కొత్తగూడెంటౌన్: జిల్లాస్థాయి యువజనోత్సవాలను బుధవారం నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి టి.సీతారాం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగూడెంక్లబ్‌లో జానపద నృత్యం, జానపద గేయాలు, ప్రకాశం స్టేడియంలో కబడ్డీ సెలక్షన్ ట్రయల్స్ ఉంటాయని పేర్కొన్నారు. 15 –29 ఏళ్ల మధ్య వయసు గల వారు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని, ఈ యువజనోత్సవాల్లో ప్రథమ స్థానంలో నిలిచిన వారిని రాష్ట్రస్థాయి వేడుకలకు పంపిస్తామని వివరించారు.

'ఫుల్లు'గా ఎంజాయ్ !

- రెండు రోజుల్లో భారీగా మద్యం అమ్మకాలు
- రూ.10 కోట్ల మేర విక్రయాలు
- గతేడాది కంటే పెరిగిన వినియోగం

పాల్వంచరూరల్: నూతన సంవత్సరం సందర్భంగా జిల్లా వాసులు 'ఫుల్లు'గా ఎంజాయ్ చేశారు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా డిసెంబర్ 31, జనవరి 1 తేదీల్లో జిల్లాలో మద్యం విక్రయాలు భారీగా పెరిగాయి. పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ నూతన సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా 31వ తేదీ రాత్రి, జనవరి 1న ఆదివారం సెలవు రావడంతో మద్యం ప్రియులు ఈరెండు రోజుల్లోనే సుమారు రూ.10 కోట్ల విలువైన వివిధ రకాల మద్యాన్ని కొనుగోలు చేశారని ఎక్సైజ్ శాఖ అంచనా వేసింది. వైరాలోని బేవరీస్ నుంచి 30వ తేదీన 15వేల కేసుల లిక్కర్, 4వేల కేసుల బీర్లను జిల్లాలోని దుకాణాదారులు కొనుగోలు చేశారు. ఈ మద్యం విలువ మొత్తం రూ.11 కోట్లుగా బేవరీస్ డీఎం.కాశీనాథం వెల్లడించారు. ప్రధానంగా జిల్లా పరిధిలోని 88 వైన్స్ షాపులు, 12 బార్ అండ్ రెస్టారెంట్లలో రూ.10 కోట్ల విలువైన బీర్లు, విస్కీ, బ్రాందీలను విక్రయించినట్లు అంచనా. గత ఏడాది నూతన సంవత్సరంలో రూ.9 కోట్ల మేర మద్యం విక్రయాలు జరగగా, ఈసారి మరో కోటి రూపాయల విలువైన మద్యం విక్రయించడం విశేషం. తద్వారా ఆబ్కారీ శాఖ ఆదాయం కూడా పెరిగిందని ఎక్సైజ్ అధికారులు అంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బెల్టుషాపుల్లో అధిక ధరలకు మద్యం విక్రయించినా మందుబాబులు ఏమాత్రం వెనుకాడకుండా ఫుల్‌గా ఎంజాయ్ చేశారు.



పండుగలకు ప్రత్యేకం..

ప్రభుత్వం ఏర్పాటు చేసిన లైసెన్స్ మద్యం దుకాణాలు పట్టణాలు, మండల కేంద్రాలు, కొన్నిచోట్ల మేజర్ పంచాయతీల్లో మాత్రమే ఉన్నాయి. ఇక మిగిలిన గ్రామాల్లో స్థానికంగా ఉండే బెల్ట్ షాపులే దిక్కు. వాటిలో ఎమ్మార్పీకి మించి మద్యం విక్రయించినా అడిగివారు లేరు. ఇక 16 - 40 ఏళ్ల మధ్య వయసు గలవారు వివిధ రకాల బీర్లకు, 40 - 55 ఏళ్ల మధ్య వయసు గలవారు వివిధ రకాల విస్కీలు, బ్రాందీలు వినియోగిస్తున్నారు. ఇక సాధారణ రోజుల కంటే వరస సెలవులు, పండగలు వచ్చినప్పుడు కొనుగోళ్లు గణనీయంగా పెరుగుతాయని ఎక్సైజ్ శాఖ అంచనా వేసింది.

రూ.10 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి

జిల్లాలో న్యూ ఇయర్ సందర్భంగా సుమారు రూ.10కోట్ల విలువ గల మద్యం అమ్మకాలు జరిగాయి. 30, 31 తేదీల్లో 15వేల లిక్కర్ కేసులు, 4వేల బీర్ కేసులు వైరా బేవరీస్ నుంచి దుకాణాదారులు దిగుమతి చేసుకున్నారు. గతేడాదితో పోల్చితే ఈ సంవత్సరం నూతన సంవత్సరం సందర్భంగా మా శాఖ ఆదాయం కొంతమేర పెరిగింది.

– జానయ్య, ఎక్సైజ్ సూపరింటెండెంట్

బీఆర్ఎస్ వైపే ముస్లిం మైనార్టీలు: మంత్రి పువ్వాడ

ఖమ్మంమయూరిసెంటర్: గతంలో ఎక్కువశాతం మైనార్టీలు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపేవారని, తెలంగాణ ఏర్పడ్డాక మాత్రం మైనార్టీలంతా బీఆర్ఎస్‌ను నమ్ముతూ పార్టీ వెంటే ఉన్నారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. ఖమ్మంలోని షాదీఖానాలో సోమవారం నిర్వహించిన ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి మాట్లాడారు. ఖమ్మంకు ఓ ప్రత్యేకత ఉందని.. ఇక్కడ ముస్లింలు, హిందువులు, క్రైస్తవులంతా కలిసి మెలసి ఉంటారని తెలిపారు. ఖమ్మం మతతత్వ పార్టీలకు వేదిక కాకూడదని పిలుపునిచ్చారు. కొందరికి అర్హత ఉండి పదవులు రాకున్నా బాధ్యతతో వ్యవహరిస్తుండగా మరికొందరికి పదవులు వచ్చినా కడుపునొప్పి ఉందని చెప్పారు. కేఎంసీ ఎన్నికల సందర్భంగా 54 మందికి కార్పొరేటర్ టికెట్లు ఇవ్వడానికి.. 500 మంది కడుపులో తలపెట్టి బతిమిలాడానని గుర్తు చేశారు. ముస్లిం మైనార్టీలకు ఐదు టికెట్లు ఇచ్చి అందరినీ గెలిపించుకున్నామని చెప్పారు. కాగా, ఖమ్మం మార్కెట్‌కు కొత్త పాలకవర్గంలో వైస్ చైర్మన్‌గా అఫ్జల్ మియాను నియమించనున్నట్లు మంత్రి అజయ్ ప్రకటించారు.

ప్రధాన ప్రతిపక్షం లేకే....

కాంగ్రెస్ పార్టీ ప్రధాన ప్రతిపక్ష పాత్ర పోషించి ఉంటే ఈరోజు ఇన్ని రాష్ట్రాల్లో బీజేపీ బలపడేది కాదని మంత్రి పువ్వాడ పేర్కొన్నారు. అందుకే బీఆర్ఎస్ బీజేపీని నిలువరించేందుకు యత్నిస్తున్నందున మతతత్వ శక్తుల విషయంలో ముస్లిం యువత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పథకాలు, పదవుల కోసం కాకుండా తనకు ఆత్మీయులైన ముస్లిం మైనార్టీలతో మొదటి ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తనను అజయ్‌ఖాన్ అని ట్రోల్ చేయడాన్ని గర్వపడుతున్నానని చెప్పారు. వచ్చేవారు వస్తారు.. పోయేవారు పోతారని.. ఈ భూమి పుత్రుడు ఎవరో గుర్తుంచుకోవాలని కోరారు.



ఉత్తర ద్వారం నుంచి స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు, (ఇన్‌సెట్) ఉత్తర ద్వారంలో సీతారామలక్ష్మణమూర్తులు..



మిథిలా స్టేడియంలో భక్తుల సందడి



కీర్తనలు ఆలపిస్తున్న విద్వాంసులు



పుర వీధుల్లో స్వామి వారి ఊరేగింపు..



ఉత్తర ద్వారం మెట్ల వద్ద బారులుదీరిన భక్తజనం

ముక్కోటి పుణ్యఫలం..

వేదపండితుల మంత్రోచ్ఛరణలు..
ధూపదీపాలు.. జయ జయ ధ్వానాల నడుమ
శ్రీసీతారామ చంద్రస్వామివారు దర్శనమివ్వగా...
అప్పటికే వేయి కళ్లతో వేచి చూస్తున్న భక్తులు
కనులారా వీక్షించి.. భక్తిభావంతో ఉప్పొంగారు.
మంగళ వాయిద్యాలు మోగుతుండగా..
వైకుంఠ ద్వారం తెరుచుకున్న క్షణాన
దివ్యతేజస్సుతో సాక్షాత్కారించిన
రామయ్యను చూసి భద్రగిరి క్షేత్రం పులకించింది.
ఉత్తర ద్వార దర్శనంతో ముక్కోటి దేవతలను
దర్శించుకున్నంత పుణ్యఫలం సిద్ధిస్తుందని
వేద పండితులు పేర్కొన్నారు. -స్టాఫ్ ఫొటోగ్రాఫర్



హాజరైన భద్రాద్రి జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య



వేడుకలకు హాజరైన ఎమ్మెల్సీ తాతా మధు



రాముల వారితో సెల్ఫీ..



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ అనుదీప్, ఐటీడీఏ పీఓ గౌతమ్, పక్కన ములుగు కలెక్టర్ కృష్ణాదిత్య



వేడుకలకు హాజరైన ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ



జై శ్రీరామ్..



స్వామివారి దర్శనానికొచ్చిన దివ్యాంగుడు..

క్లుప్తంగా

నేడు బీజేపీ ఓబీసీ మోర్చా శిక్షణ తరగతులు

చుంచుపల్లి: ఉమ్మడి జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా శిక్షణ తరగతులు మంగళవారం కొత్తగూడెం క్లబ్‌లో ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటలకు తరగతులు ప్రారంభమవుతాయని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఆకుల నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ తరగతులకు ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆలే భాస్కర్‌రాజ్ తదితరులు హాజరుకానుండగా, ఓబీసీ మోర్చా రాష్ట్ర పదాధికారులు, జిల్లా కార్యవర్గం, మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పాల్గొనాలని కోరారు.

అప్పుల భారంతో ఆత్మహత్య

దమ్మపేట: అప్పుల భారంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని అప్పారావుపేట గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం... మండల పరిధిలోని అప్పారావుపేట గ్రామానికి చెందిన గండిపూడి సాయి(26) కిరాయికి తిప్పడం కోసం ఒక పాత లారీని కొనుగోలు చేశాడు. లారీ తరచుగా మరమ్మతులకు గురికావడంతో నిర్వహణకు అధిక మొత్తంలో అప్పులు చేయాల్సి వచ్చింది. అప్పుల భారంతో పాటుగా కుటుంబ పోషణ కూడా కష్టతరంగా మారింది. దీంతో మనోవేదన చెంది గత నెల 26న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు సత్తుపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడి తల్లి గండిపూడి దుర్గ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

గూడ్స్ రైలు ఢీకొని బిహార్ వాసి మృతి

చండ్రుగొండ : మండలంలోని జర్పులతండా వద్ద గూడ్స్ రైలు ఢీకొని బిహార్ రాష్ట్రానికి చెందిన రవికిషన్ సహాని (20) మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. బిహార్ రాష్ట్రానికి చెందిన 20 మంది కూలీలు జామాయిల్ నరికే పనుల కోసం ఇటీవల తుంగారం పంచాయతీ జర్పుల తండాకు వచ్చారు. ఈ క్రమంలో సోమవారం వేకువజామున బహిర్భూమికి వెళ్లే క్రమంలో కొత్తగూడెం – సత్తుపల్లి రైల్వేట్రాక్ దాటుతుండగా సహానిని రైలు కొట్టింది. దీంతో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. సహాని తండ్రి ఉమేష్ ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి...

ఇల్లెందురూరల్: మండలంలోని కొమ్ముగూడెం పంచాయతీ అ శోక్‌నగర్ సమీపంలో ఆదివా రం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందా డు. ముత్తారపుకట్ట గ్రామపంచాయతీకి చెందిన మెస్సు భిక్షప తి (33) ఇల్లెందులోని తన సెల్‌పాయింట్లో విధులు ముగించుకుని ఆదివారం రాత్రి బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో అశోక్‌నగర్ గ్రామ శివారులోని మూలమలుపు వద్ద ప్రమాదవశాత్తు పొలం గట్లలో పడిపోయి మృతి చెందాడు. సోమవారం ఉదయం అటుగా వెళ్లినవారు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,741

పరోక్ష సేవలకు ఆదరణ

భద్రాచలం: తెప్పోత్సవం, ఉత్తర ద్వార దర్శనాలలో వివిధ కారణాలతో ప్రత్యక్షంగా పాల్గొనలేని భక్తుల కోసం దేవస్థానం అధికారులు ప్రవేశ పెట్టిన పరోక్ష సేవలకు ఆదరణ పెరిగింది. పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో ఉత్తర ద్వార దర్శనం రోజు మాత్రమే వారి పేరుతో సుమారు 200 మంది భక్తులు రూ.200 టికెట్లతో పరోక్షంగా అర్చన జరిపించుకున్నారు. వీరికి దేవస్థానం తరఫున కుంకుమ, డ్రై ఫ్రూట్స్‌ను అధికారులు పోస్టల్ ద్వారా పంపనున్నారు. రూ.1000 ప్రవేశపెట్టిన స్వామి వారి మూలవరుల ప్రత్యేక పూజకు 51 టికెట్లను భక్తులు రిజర్వ్ చేసుకుని పూజలు జరిపించుకున్నారు. వీరికి దేవస్థానం తరఫున స్వామి వారి కండువా, ప్రసాదం తదితర సామగ్రిను పోస్టల్ ద్వారా పంపనున్నారు. లక్షకు పైగా లడ్డూలను విక్రయించారు. కాగా ఉత్తర ద్వార దర్శన టికెట్లను సైతం 85 శాతానికి పైగా విక్రయించినట్లు ఆలయ అధికారులు చెబుతున్నారు.

ఆదాయం ఇలా..

ఉత్తర ద్వార దర్శనం రోజున స్వామి వారికి సుమారు రూ.8 లక్షల ఆదాయం సమకూరింది. కౌంటర్ల ద్వారా రూ.5,86,150, అన్నదానానికి విరాళాలు ద్వారా రూ. 70,711, ప్రచార శాఖ ద్వారా రూ. 9,330, కేశఖండన ద్వార రూ.60 వేలు, తలంబ్రాల ద్వారా రూ.960, గోశాల ద్వారా రూ.11,116, పర్ణశాల టికెట్ల అమ్మకం ద్వారా రూ.15,130 మొత్తం రూ.7,54,397 ఆదాయం లభించింది. ప్రసాదాలు, టికెట్ల అమ్మకం ద్వారా వచ్చిన నగదు అదనంగా జమ కావాల్సి ఉంది. కాగా స్వామి వారికి 1200 మంది భక్తులు తలనీలాలను సమర్పించినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

తగ్గిన వీవీఐపీల సందడి

భద్రాచలం: తెప్పోత్సవం, ఉత్తర ద్వార దర్శనాలలో వీఐపీల సందడి తగ్గింది. ఆదివారం జరిగిన తెప్పోత్సవంలో కేవలం స్థానిక ఎమ్మెల్యే పొదెం వీరయ్య మాత్రమే హాజరుకాగా, సోమవారం తెల్లవారుజామున జరిగిన ఉత్తర ద్వార దర్శనంలో ఆయనతో పాటుగా వైరా, ఇల్లెందు ఎమ్మెల్యేలు రాములు నాయక్, హరిప్రియతోపాటు ఎమ్మెల్సీ తాతా మధు మాత్రమే పాల్గొన్నారు. డిసెంబర్ 28న జరిగిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పర్యటనలో మంత్రులు పువ్వాడ అజయ్‌కుమార్, సత్యవతి రాథోడ్‌తో పాటుగా ఎంపీ మాలోత్ కవిత పాల్గొన్నారు. ఆ వెంటనే జరిగిన ఉత్సవాలకు వీరు హాజరు కాకపోవడంతో వీవీఐపీల సందడి చాలా తగ్గింది. దర్శనం అనంతరం ఆలయ ఈఓ శివాజీ ఆధ్వర్యంలో వీవీఐపీలకు వేదాశీర్వచనం జరిపించి శాలువాలతో సత్కరించి ప్రసాదాలను అందచేశారు. కాగా సోమవారం స్వామి వారిని 20 వేల మందికి పైగా భక్తులు దర్శించుకున్నట్లుఅధికారులు తెలిపారు.

పర్ణశాలను సందర్శించిన కలెక్టర్ దంపతులు



కలెక్టర్ దంపతులకు జ్ఞాపిక బహూకరణ..

దుమ్ముగూడెం: ముక్కోటి పర్వదినం సందర్భంగా పర్ణశాల శ్రీసీతారామచంద్రస్వామి వారిని కలెక్టర్ అనుదీప్ దంపతులు సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పంచవటి కుటీరం, నార చీరల ప్రాంతాన్ని సందర్శించి వాటి విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీఓ చంద్రమౌళి, సీఐ దోమల రమేష్, ఎంపీఓ ముత్యాల రావు కలెక్టర్‌ను సత్కరించి జ్ఞాపికను అందించారు.

ముత్యాలమ్మ వారి సేవలో ఎస్పీ..



అమ్మవారి సన్నిధిలో..

భద్రాచలంటౌన్: పట్టణంలోని పాత ఎల్‌ఐసీ ఆఫీస్ రోడ్‌లోని శ్రీముత్యాలమ్మ అమ్మవారిని ఎస్పీ డాక్టర్ జి.వినీత్ కుటుంబ సమేతంగా సోమవారం దర్శించుకున్నారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఓఎస్డీ సాయిమనోహర్, ఆయల కమిటీ అధ్యక్షుడు హరిచంద్ర నాయక్, కార్యదర్శి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఆయిల్‌పామ్ మొక్కల అమ్మకం

- దళారులు, మార్క్‌ఫెడ్ నర్సరీ సిబ్బంది నిర్వాకం
- మరోపక్క రైతులను దొంగలుగా చిత్రీకరించే యత్నం

పెనుబల్లి: ప్రభుత్వ ప్రోత్సాహకాలకు తోడు అధికారులు కల్పిస్తున్న అవగాహనతో ఆయిల్‌పామ్ సాగుకు ముందుకొస్తున్న రైతుల ఆశలపై కొందరు దళారులు నీళ్లు చలుతున్నారు. మార్క్‌ఫెడ్ సిబ్బంది, నర్సరీ సెక్యూరిటీగా ఉన్న సిబ్బంది కలిసి రైతులకు దక్కాల్సిన ఆయిల్‌పామ్ మొక్కలను రాత్రికిరాత్రే పక్క రాష్ట్రం రైతులకు అమ్ముకుంటున్న విషయం వెలుగు చూసింది. పెనుబల్లి మండలం కుప్పెనకుంట్లలోని నర్సరీ వద్ద బయటపడిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. కుప్పెనకుంట్లలో ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా నర్సరీ ఏర్పాటు చేసి 1.60లక్షల ఆయిల్‌పామ్ మొక్కలను పెంచుతోంది. వీటిని ఉమ్మడి జిల్లాలో దరఖాస్తు చేసుకున్న రైతులకు సీనియారిటీ ఆధారంగా ఇవ్వాల్సి ఉంది. అయితే, అశ్వారావుపేట సరిహద్దు ఏపీలోని చింతలపూడి రైతులు ఆయిల్‌పామ్‌పై ఆసక్తి చూపుతుండడంతో దళారులు మార్క్‌ఫెడ్, సెక్యూరిటీ సిబ్బంది సహకారంతో ఒక్కో మొక్కను రూ.350 నుండి రూ.450 వరకు ఇస్తామంటూ నమ్మబలికి రాత్రికి రాత్రే తరలిస్తున్నారు. ఈ క్రమంలోనే ఆదివారం రాత్రి ఐదు వాహనాల్లో మొక్కలను తరలించే ప్రయత్నం చేశారు. రెండు వాహనాల్లో మొక్కలు తీసుకెళ్లాక, మిగిలిన మూడు వాహనాల్లో మొక్కలు లోడ్ చేస్తుండగా స్థానిక రైతులు గుర్తించి ఫిర్యాదు చేయగా.. వీఎం బంజర్ అర్ధరాత్రి కుప్పెనకుంట్లకు చేరుకుని వాహనాలు, డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు. ఇక మార్క్‌ఫెడ్ డివిజనల్ మేనేజర్ బాలకృష్ణ సోమవారం ఇదే విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నెపం రైతులపైకి నెట్టేలా...

ఆయిల్‌పామ్ మొక్కలు అమ్ముతామని చింతపూడి రైతులను నమ్మబలికిన దళారులు ఇప్పటికే అశ్వారావుపేటకు చెందిన ఎరువుల దుకాణం వ్యాపారి, సెక్యూరిటీ గార్డుకు నగదు ఇచ్చినట్లు సమాచారం. ఇంతలోనే విషయం బయటపడడంతో ఏపీ రైతులు, వాహనాల డ్రైవర్లే దొంగతనంగా వచ్చి మొక్కలు తీసుకెళ్తున్నట్లు నెపం వారిపైకి మోపేందుకు మార్క్‌ఫెడ్ సిబ్బంది, సెక్యూరిటీ గార్డులు యత్నిస్తున్నట్లు సమాచారం.

తాటి.. వరి నాటి..



వరి పొలంలో కూలీలతో తాటి వెంకటేశ్వర్లు



నారు కట్టలను తీసుకొస్తున్న తాటి

ములకలపల్లి : మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకుడు తాటి వెంకటేశ్వర్లు సోమవారం వ్యవసాయ కూలీగా మారారు. మండల పరిధిలోని సీతారాంపురం గ్రామశివారులోని రోడ్డు పక్కనే ఉన్న వరిపొలంలో కూలీలు నాటు వేస్తున్నారు. అటుగా వస్తున్న తాటి వెంకటేశ్వర్లు గమనించి అక్కడ కొద్దిసేపు ఆగారు. మమేకమై వరినాటు వేస్తూ కూలీల్లో ఉత్సాహం నింపారు.

మరణంలోనూ కలిసే..

- ఆటోను కారు ఢీకొట్టడంతో భార్యాభర్తలు మృతి
- బంధువుల ఇంటికి వెళ్లొస్తుండగా ప్రమాదం



శ్రీలత, వీరన్న దంపతులు(ఫైల్)

పాల్వంచ: ఆ జంట అన్యోన్య దాంపత్యం చూసి దేవుడికి కన్ను కుట్టినట్లుంది. రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు దంపతులిద్దరినీ కబళించింది. నూతన సంవత్సరం రోజే ఆ ఇంట్లో తీవ్ర విషాదం నింపింది. తల్లిదండ్రుల మృతితో కొడుకు, కూతురు అనాథలయ్యారు. పోలీసుల కథనం ప్రకారం.. చుంచుపల్లి మండలం గాంధీ కాలనీకి చెందిన కొల్లూరి వీరన్న(44) – శ్రీలత (37) దంపతులు పాల్వంచలోని శ్రీలత సోదరుడి ఇంటికి ఆదివారం మధ్యాహ్నం ఆటోలో వచ్చారు. రాత్రి 12.30 గంటల సమయంలో పాల్వంచ నుంచి తిరిగి ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో కేఎస్‌ఎం పెట్రోల్ బంక్ వద్ద డీజిల్ కొట్టించుకునేందుకు ఆటోను యూ టర్న్ తీసుకుంటుండగా కొత్తగూడెం నుంచి పాల్వంచ వైపు అతి వేగంతో వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో ఆటో నుజ్జునుజ్జు కాగా, ఇద్దరికి బలమైన గాయాలయ్యాయి. వీరన్న అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీలతను స్థానికులు గుర్తించి కొత్తగూడెం తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఖమ్మం ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతులకు కుమారుడు, కూతురు ఉన్నారు. కొడుకు ఉదయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ప్రవీణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి మృతదేహాలను తీసుకురాగా అక్కడ బంధువుల రోదనలు మిన్నంటాయి. కాగా, వీరన్న – శ్రీలత మృతదేహాల వద్ద సీపీఐ జిల్లా కార్యదర్శి సాబిర్‌పాషా నివాళులర్పించి మాట్లాడుతూ తల్లిదండ్రుల మృతితో అనాథలుగా మిగిలిన చిన్నారులను ఆదుకోవాలని కోరారు.

మంత్రిని కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

కొత్తగూడెంఅర్బన్: బీఆర్‌ఎస్‌కు చెందిన కొత్తగూడెం మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు సోమవారం ఖమ్మంలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ను కలిసి నూతన సంవత్సరం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఘనంగా సన్మానించారు. అనంతరం కొత్తగూడెం మున్సిపాలిటీలో ప్రస్తుత పరిస్థితులు, చోటు చేసుకుంటున్న పరిణామాలపై చర్చించినట్లు వివరించారు. మంత్రి కలిసిన వారిలో కౌన్సిలర్ బండి నర్సింహా, బీఆర్‌ఎస్ నాయకులు బాలిశెట్టి సుందర్‌రావు, మహ్మద్ యూసఫ్, కంభంపాటి దుర్గాప్రసాద్, బ్యాండ్ రమణా, మోరె రమేష్ ఉన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల సందర్శన



కళాశాలలో రీజనల్ జాయింట్ డైరెక్టర్లు

భద్రాచలంటౌన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలను కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషనల్ రీజినల్ జాయింట్ డైరెక్టర్లు సోమవారం సందర్శించారు. న్యాక్ సన్నద్ధతలో భాగంగా రీజనల్ జాయింట్ డైరెక్టర్–1 జి.యాదగిరి, రీజనల్ జాయింట్ డైరెక్టర్–2 బి.రాంజేందర్ సింగ్ కళాశాలను పరిశీలించారు. అనంతరం అధ్యాపకులకు, సిబ్బందికి పలు సలహాలు, సూచనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డి.భద్రయ్య, ఎస్.నరేంద్రరెడ్డి, కామేశ్వరరావు, వీరన్న, శ్యామ్‌ప్రసాద్, రాఘసుమ, ఏ.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్లపై కేసు నమోదు

దమ్మపేట: మండల పరిధిలోని మల్లారం, రాచూరిపల్లి గ్రామ శివారు పామాయిల్ క్షేత్రాల్లోని పేకాట శిబిరాలపై సోమవారం పోలీసులు దాడి చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మల్లారం గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారనే సమాచారం అందగా పోలీసులు దాడి చేసి 10 మందిని అరెస్ట్ చేశారు. రూ.14,300 నగదు స్వాధీనం చేసుకున్నారు. రాచూరిపల్లి గ్రామ శివారులో కూడా పేకాట శిబిరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేశారు. రెండు బైక్‌లు, రూ.6,720 స్వాధీనం చేసుకున్నారు. రెండు ఘటనల్లో కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా పేకాట ఆడి నష్టపోయి కుటుంబాలను ఆర్థిక ఇబ్బందులకు గురిచేయొద్దని ఎస్సై శ్రావణ్‌కుమార్ సూచించారు.

రేషన్ బియ్యం పట్టివేత

జూలూరుపాడు: జూలూరుపాడు గ్రామ శివారులో అక్రమంగా నిల్వఉన్న 6 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సోమవారం పోలీసులు పట్టుకున్నారు. ఏఎస్సై తిరుపతిరావు కథనం ప్రకారం.. జూలూరుపాడు గ్రామ శివారులోని ఈద్గా సమీపంలో రేషన్ బియ్యం నిల్వ ఉన్నట్లు సమాచారం అందింది. దీంతో దాడి చేసి ఆరు క్వింటాళ్లను స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా నిల్వ చేసిన అన్నారుపాడు గ్రామానికి చెందిన రామకృష్ణను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.